
# అట్యాక్



క్రైన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

- యు.వి.రత్నం

**రా**మయ్యగారి యంకయ్య అన్నం తిని నాలుగు రోజులయింది. ఇష్టమయినవి ఏంచేసి పెట్టినా గంగ ముట్టడం లేదు. ఓ పక్క ఎడ తెరిపి లేని వానలు. ముసురుపట్టిన ఆకాశం. చిత్తడి చిత్తడిగా నేల. బజార్లో కాలువలన్నీ పొంగి నీళ్లు, ఇళ్ళల్లోకి తన్ను కొస్తున్నాయి. దీనికితోడు వెంకయ్యకు అన్నం కంచం చూస్తే చాలు "వాక్" అంటూ వహటే కక్కులు.

"ఏం తిన్నావ్ రా యంకా" అంటే ఏం తినలేదని తలకాయ అడ్డంగా వూపటం తప్ప ఏం మాట్లాడటం లేదు. యంకయ్య పెండ్లాం నాగలక్ష్మి బహు దిగులు పడిపోయింది.

తంబళ సుబ్బయ్య దగ్గర కస్తూరి మాత్ర తెచ్చి ఏసింది. ఆచారి గారింట్లో కాస్త "అన్నభేది" సింధూరం తెచ్చి తేనెలో రంగరించి తిరపతి లో కొన్న సాన మీద రంగరించి మూడు పూట్లా, పెరట్లో బాదం ఆకు మీద యేసి నాకించింది. ససేమిరా గుణం కనిపించలా. "వాక్ " అంటూనే వున్నాడు యంకయ్య.

ఏందిరా దేవుడా! అనుకుంటూ నాగలక్ష్మి. యంకయ్య మొల్లో వున్న వాండ్ల నాయనమ్మ కట్టిన తాయత్తు కు సాంబ్రాణి పొగ వేసి, కొండేపి జాలయ్య దగ్గర జపం జేసిన తీర్థం తీసుకొచ్చి పట్టింది. ఉన్నట్లుండి యంకయ్య వులిక్కి పడుతున్నాడు.

ఉలికిపడ్డప్పుడల్లా నాగలక్ష్మి గుండెబేజారు అయిపోతున్నాది.

చదులోడ యెళ్ళొచ్చాడేమోనని అనుమానం నాగలక్ష్మికి. ఇదివరలో చదులోడ యెళ్ళోచ్చినా యింత బేకారయే వాడు కాదు యంకయ్య.

భోగం రంగనాయకి మనవరాలు మీనాక్షి చదల వాడలో కాపరం వుండేది. అది నల్లమందు అమ్మేది కొన్నాళ్ళు. ఆ తరువాత ఓ బ్రాంది కొట్టు రామకోటిని వుంచుకొని, కల్తీమందు అమ్ముతుందని అంతా అంటుండే వాళ్లు, దాని దగ్గర కెళ్ళి, డబ్బులున్న శనారం సాయంత్రం, ఆదివారానికి రెండు డ్రాములు తెచ్చుకొని, కొత్తపట్నంలో చందవా చాపలు కొని తెచ్చుకొని, శ్యాంప్రసాద్ టాకిస్ కాడికెళ్లి 3 రూపాయలకి చీకులు, ఆరు రూపాయలకు చందవా చాపలకి మసాల తెచ్చుకొని తిని, 2 డ్రాములేసుకొని పడుండేవాడు యంకయ్య. పోనీలే ఆదారం కదా! అలసి, సొలసి వున్నాడు ఆడి సంబరం ఎందుక్కాదనాలని వూరుకండేది నాగలక్ష్మి.

నాలుగురోజుల క్రితం గుంటూరెల్లొచ్చిన కాడ్నించి ఏం తిన్నాడో ఏమో బహటే డోకులు, నోటి దగ్గర కేం ఎళ్ళినా వాంతి చేసుకుంటున్నాడు యంకయ్య.

ఏం పాలు పోవడం లేదు నాగలక్ష్మికి.

తూర్పు యీధి లో వున్న ఆదినారాయణ మావ దగ్గరకెళ్లి బావురుమంది నాగలక్ష్మి.

ఆదినారాయణ స్వయాన మేనత్త కొడుకు, రెండేళ్ళు తనకంటే పెద్ద. అయ్యపోయిన కాడ్నించి తనే పెంచి, కాసింత కొండ్ర, కట్టపడే మానవుడని యంకయ్యకిచ్చి చేశాడు మావ ఆదినారాయణ. ఇప్పటికే కష్టం వచ్చినా, సుఖం వచ్చినా ఆదినారాయణకే చెప్పుకుంటుంది నాగలక్ష్మి. ఆదినారాయణ మాటన్నా యంకయ్యకు వేదవాక్కు. జవదాటేవోడు కాదు. అదేందో కాని ఈ సారి ఆదినారాయణ మాట క్కూడా మళ్ళ బడ్డాడు. ఏం జేశావ్ రా యంకయ్య అని నయాన భయాన అడిగినా "అడ్డం గా తలకాయ ఊపడం తప్ప" ఏం జెప్పడంలా.

అమాయకం గా మొహం బెట్టి చేసేం తప్పు చెయ్యలేదనట్టు చూసేవాడు. ఆడు చూసే చూపు కూడా, చిడిమాను మీద బెదిరిన మేకపిల్ల చూపు లాగుంది.

ఓసేవ్ లచ్చిమి, యీడికి ఇల్లా తగ్గేట్లు లేదు కాని పట్నం తీసుకెళ్ళి అదేదో హిప్నటిజమ్ అంట అది చేసో, కరంటో పెట్టి చెప్పిత్తారంట గుంటూరులో రాజుడాక్టరు. ఆయనకు చూపిద్దాం అన్నాడు ఆదినారాయణ మావ.

నా దగ్గర అంత డబ్బు ఏడుంది మావ అంది నాగలక్ష్మి. ఇదిగో ఈ బంగారం పుస్తెల తాడు బ్యాంకులో ఎట్టి బంగారం మీద అప్పు తీసుకో మావ.ఆడు బాగుంటే కదా దీని ఇలువ అంటూ మెళ్లో బంగారం నానుతాడు తీసిచ్చింది నాగలక్ష్మి.

ఆదినారాయణ మొదట్లో అందుకు ఒప్పుకోలేదు. కాని తన దగ్గరా పైకం అందుబాట్లో లేదు. పైకం అంతంత మాత్రంగా వుంది. శనగలు అమ్మిన డబ్బులు ఇంకా చేతికి రాలా. శనగల లోడు తీసికెళ్ళిన కడపశెట్టి వారం గడువు పెట్టాడు. డబ్బు ఈయటానికి సరుకు మాత్రం తోలాల్సి వచ్చింది. ప్రతి సంవత్సరం ఇదే తంతు శెట్టిది. అయినా తప్పడం లేదు. కొనబోతే కొరవి, అమ్మబోతే అడవి లాగుంది వ్యవసాయం.

"సర్లే" అంటూ బ్యాంకులో అప్పుకి బయలుదేరాడు ఆదినారాయణ. కొత్తగా వచ్చిన మేనేజరు మంచోడు, పాపం అయితే నేం అన్ని పన్లు తానే చేసుకుండేవోడు, ఆఫీసులో. హామి లేకుండా అప్పిచ్చేవోడుగారు. అర్జంటని మేనేజర్ని బతిమిలాడి, సొమ్ముల భూషణం దగ్గర బంగారం గీటుపెట్టించి పట్టు కొచ్చాడు బ్యాంకుకి ఆదినారాయణ. సొమ్ముల భూషణం బంగారం గీటుపెట్టి మంచిదని సంతకం పెడితే గాని బ్యాంకులో అప్పు యిచ్చే వారు కాదు. భూషణం బంగారం గట్టిగాఅరగ దీయద్దని దగ్గరుండి గీటు పెట్టించి, బ్యాంకులో డబ్బుచ్చుకునే సరికి, చావు తప్పి కన్నులొట్ట పోయినంత అయింది ఆదినారాయణకి.

మధ్యాహ్నం రెండు గంటల యాళకి ఎర్రబస్సులో యంకయ్య నోటికి గుడ్డ అడ్డం పెట్టి నాగలక్ష్మిని, యంకయ్యని బస్సులో కిటికి దగ్గర కూకోబెట్టి తను కండక్టరు ప్రక్కన కూర్చున్నాడు ఆదినారాయణ.బస్సు దిగిందాకా నాగలక్ష్మి బిత్తర బిత్తర చూపులు చూస్తూనే వుంది.

గుంటూరు, కొత్తపేట రోడ్డులో సినిమా హాలు కాడ ఆటో దిగేటప్పటికి మధ్యాన్నం రెండు గంటలయింది. లీలామహల్ పక్క సందులో రామయ్య మెస్ కాడకెళ్లి కాస్త ప్లేటు బోజనం చేసేసరికి మూడయింది.యంకయ్యని చూస్తే జాలేస్తున్నది. నాలుగు రోజుల నుండి ఏం తినడం లేదు. మడిసి జార్లపడిపోతున్నాడు. డాక్టరు రాజుగారి దగ్గర కెళ్ళి డబ్బు గట్టి అన్ని పరిచ్చలు అయ్యేసరికి నాలుగు గంటలయింది. పరిచ్చలయిందాక డాక్టరు చెయ్యి ముట్టుకోలా.

ఆస్పత్రి లోపలంతా చలువరాళ్ళు. ఎండలో తిరిగి తిరిగి వచ్చారేమో చల్లగా ఏ.సి. గాలి తగిలేసరికి ప్రాణం లేచి వచ్చి నట్లయింది నాగలక్ష్మికి. "దాం దుంప తెగ డబ్బులు పోతే పోయిందిగాని కాసేపు ఈడే కూకుంటే బాగుండే దట్టుందని అనుకుంది నాగలక్ష్మి మెడ తడుంకుంటూ." పుస్తెల బంగారు నానుతాడుకి బదులు, పసుపుదారం తాడు చల్లగా తగిలి వులిక్కిపడింది నాగలక్ష్మి.

ఆస్పత్రికొచ్చి అప్పుడే రెండు రోజులయింది. మరీ పట్నం వచ్చింతరువాత ఎర్రి చూపులు చూస్తున్నా డెంకయ్య. ఏం తోచక నాగలక్ష్మి రూపాయి ఫోన్ కాడికెళ్లి ఆడపడుచు పేరిందేవికి అన్న గురించి ఇవరం చెప్పేసరికి, దానికీ వుండబట్టలేక ఎంబడే బయలుదేరి వస్తాం మీరక్కడే వుండండి అని "సాయంకాలానికి రావులపాలెం వచ్చి ఆడ్నించి బస్సులో గుంటూరు చేరుకుంటా"మంది పేరిందేవి. కాస్త ధేర్నంగా వుండమంది పేరిందేవి. "సర్లే" అని ఫోన్ పెట్టేసింది నాగలక్ష్మి. ఏందే పరధ్యానంగా వున్నావ్, తగ్గుతుందిలే -అన్న మావ ఆదినారాయణ మాటల్లో ఈ లోకంలో కొచ్చి పడింది నాగలక్ష్మి. ఆస్పత్రిలో ఉన్న రెండు రోజులు తెచ్చిన డబ్బులు నాలుగు అయిపోయినయ్ గాని యంకయ్యకు వాంతులు తగ్గుమోహంపట్లే. డాక్టర్లు రోజూ చూసి పోతూనే వున్నారు. సూదిమందులు, నోట్లోకి గొట్టాలు, అన్నీ అయినాయ్, అయినా రోగం ఎంటో అంతుబట్టంలేదు. ఇంకా ఆస్పత్రిలోనే వుండమంటున్నారు డాక్టర్లు.ఆళ్ళదేంపోయింది."పిల్లికి చలగాటం ఎలక్కి ప్రాణసంకటం"గా వుంది.

సాయంకాలం పేరిందేవి వచ్చింది "గుడ్లలో నీళ్ళు గుడ్లల్లో కుక్కుకుంటూ". తమ్ముడంటే దానికి ప్రాణం. చిన్నప్పట్నించి ఒక్కటిగా పెరిగారు. పెండ్లయిం తరువాత దూరాభారం అయినా రెండు కొబ్బరితోటలు, ఆకుతోటలు వున్న రాయుడికిచ్చాకయినా పేరిందేవి తమ్ముణ్ణి చూడ్డానికి ప్రతిసంవత్సరం వస్తుండేది. ఈసారే ఆలస్యం అయింది.

ఓరే రామా! ఎందిరా అయ్య ఏం జేసా పట్నంలో అని అడిగింది.

ఎప్పటిలానే తలకాయ అడ్డంగా దిప్పటం తప్ప యంకయ్య మారు మాట్లాడలా- అక్క రెండుసార్లు- అడగ్గా, అడగ్గా - రెండు వేళ్ళూ చూపించి, రెండు అట్లు తిన్నాట్ట పట్నం 'ప్లాస్టిక్ ప్లేట్'లో అది వచ్చింది తంటా - ఏదో జ్ఞాపకం వచ్చినట్లు పేరిందేవి గబగబా డాక్టర్ కాడికెళ్లి తమ్ముడ్ని ఇంటికి తీసికెళ్తానని చెప్పి, దాని దగ్గరా, నాగలక్ష్మి దగ్గరా వున్న డబ్బులు కలేసి ఆస్పత్రికి కట్టి ఆజావున రాత్రికి రాత్రి బయలు దేర తీసింది 'వాడపల్లి'కి.

పేరిందేవి వాండ్లవూరు 'వాడపిల్లి' చేరే సరికి ఉదయం ఆరు గంటలయింది. కోనసీమ తోటలో ఇల్లేమో చల్లగా ఏ.సి. రూమ్‌లో లా వుంది. హాయిగా వుంది.

మధ్యాహ్నానికి అన్నం వండి, ఘాటుగా ఉల్లిపాయ కారం, ఘుమఘుమలాడుతూ వంకాయ యేసి గోంగూర పులుసుకూర, పొలస చేపల పులుసు కాచి, తోటలో పెద్ద అరటిఆకు కోసి తమ్ముడికి వడ్డించింది పేరిందేవి. ఏకళనున్నాడో ఏమో యంకయ్య అరిటాకు చూసేసరికి ఆవురావురుమంటూ గోంగూర లో గట్టిమీగడ పెరుగు నంచుకుంటూ భోజనం కానిచ్చేడు యంకయ్య. అప్పటికి గాని నాగలక్ష్మి ఈ లోకంలోకొచ్చి పడలేదు.

కన్నార్పకుండా చూస్తున్న నాగలక్ష్మిని ప్రక్కకి లాక్కెళ్లి పేరిందేవి రహస్యంగా "ఇంకెప్పుడూ ఆడ్ని పట్నం పంపమాక అంతా ప్లాస్టిక్ మయం అయిపోయింది దాంట్లో తిని వాడికి వాంతులు అయ్యింది." ఆ సమయం పేరిందేవిని చూసి నాగలక్ష్మి కళ్లు " అరిటాకు"లంత అయినాయి.